క్లుప్తంగా

క్యాన్సర్ రోగికి ఆర్థిక సాయం



రోగి కుటుంబానికి రూ.25వేలు అందిస్తున్న రామ అప్పారావు మిత్ర బృందం

అగనంపూడి: క్యాన్సర్‌తో బాధ పడుతున్న చోడవరపు గణేష్ కుటుంబానికి అగనంపూడికి చెందిన సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు, మిత్ర బృందం కలిసి రూ.25వేలు ఆర్థిక సాయం అందించారు. అనకాపల్లికి చెందిన వైద్యుడు జగన్మోహనరావు బాధిత కుటుంబానికి నెలకు సరిపడా బియ్యం, నిత్యావసర వస్తువులు అందించారు. కార్యక్రమంలో దాతలు మడుగల నరసింగరావు, బలిరెడ్డి శ్రీను, బొండా ఈశ్వరరావు, ఎం.మస్తాన్‌రెడ్డి, గుడే సుశీలా గజేంద్రరావు, జామి గణేష్, కిడిమి హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు న్యాయ నిర్ణేతగా పీర్రెడ్డి



పెదగంట్యాడ: కేరళలోని పీకే దాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఈ నెల 10, 11 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ స్థాయి శరీర సౌష్టవ పోటీలకు న్యాయ నిర్ణేతగా బోయి పీర్రెడ్డి ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్ బాడీబిల్డర్స్ అసోసియేషన్, జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా సేవలందిస్తున్న పీర్రెడ్డి ఎంపికపై అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

యాత్ర-2 సినిమాకు ఉచిత టికెట్లు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతలపూడి

గాజువాక: గాజువాకలోని శ్రీకన్య థియేటర్‌లో గురువారం విడుదల కానున్న యాత్ర-2 సినిమా మ్యాట్నీ షో టికెట్లను మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య వైఎస్సార్‌సీపీ అభిమానులకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సాహసోపేతంగా నిర్వహించిన 3648 కిలోమీటర్ల పాదయాత్ర విశేషాలు, ముఖ్యమంత్రిగా ఆయన అందించిన అద్భుతమైన పాలనను ప్రజలందరికీ తెలియజేయడం కోసం తాను మ్యాట్నీ షో టికెట్లను ఉచితంగా పార్టీ అభిమానులు, తన అభిమానులకు అందజేసినట్టు తెలిపారు. ఈ సినిమా జగన్ మోహన్‌రెడ్డి పాలనను ప్రతిబింబిస్తుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాదయాత్ర ఆధారంగా రూపొందిన యాత్ర సినిమాను ప్రజలు ఎంతగానో ఆదరించారని, ఇప్పుడు యాత్ర-2ను కూడా అదే విధంగా ఆదరించాలని ఆకాంక్షించారు.

డెయిరీ కార్మికుల కేసు 20కి వాయిదా

అక్కిరెడ్డిపాలెం: విశాఖ డెయిరీలో 1983 నుంచి కాంట్రాక్ట్ లేబర్‌గా పనిచేస్తున్న 28 మందిని పర్మినెంట్ చేయాలని కోరుతూ డెయిరీ కార్మిక సంఘం నాయకులు బుధవారం జిల్లా కోర్టుకు హాజరయ్యారు. వివరాలివి.. 1983 నుంచి విశాఖ డెయిరీలో పనిచేస్తున్న 68 మంది కాంట్రాక్ట్ కార్మికుల్లో సుమారు 40 మందిని మాత్రమే పర్మినెంట్ చేయడంతో మిగిలిన 28 మంది ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ట్రిబ్యునల్ కోర్టు వీరిని పర్మినెంట్ చేయాలని 2017లో ఆదేశించినా, డెయిరీ యాజమాన్యం పట్టించుకోలేదు. దీంతో కార్మికులు జిల్లా కోర్టును ఆశ్రయించారు. ట్రిబ్యునల్ కోర్టు తీర్పును అమలు చేయనందున డెయిరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గతేడాది అక్టోబర్ 18న కోర్టుకు హాజరయ్యారు. కేసును వాయిదా వేయడంతో తిరిగి కార్మికులు బుధవారం కోర్టుకు హాజరయ్యారు. విశాఖ డెయిరీ యాజమాన్యం కోర్టులో వకాల్తా వేయడంతో తిరిగి ఈ నెల 20కి కేసును వాయిదా వేసినట్లు విశాఖ కోపరేటివ్ డెయిరీ కాంట్రాక్ట్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వరదాడ వెంకటరమణ తెలిపారు.

పదింతల శ్రద్ధ

- టెన్త్ పరీక్షలపై స్పెషల్ ఫోకస్
- వంద రోజుల ప్రణాళికతో సన్నద్ధత
- ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టి
- శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి



నడుపూరు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో స్టడీ అవర్‌లో చదువుతున్న టెన్త్ విద్యార్థులు

పెదగంట్యాడ: ప్రతీ విద్యార్థికి పదో తరగతి ఎంతో కీలకం. పబ్లిక్ పరీక్షలంటే వారిలో ఉండే భయాన్ని తొలగించి, మంచి మార్కులు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేస్తున్నారు. ప్రభుత్వం విద్యా రంగానికి ప్రాధాన్యం ఇవ్వడం, సర్కారు బడులకు కావలసిన అన్నిరకాల సదుపాయాలను సమకూరుస్తుండడంతో ఉపాధ్యాయుల్లోనూ అదే ఉత్సాహం కనిపిస్తోంది. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పదో తరగతి కీలమైన మలుపు కావడంతో, ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. అందుకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. మండలంలోని నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యారాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రత్యేక ప్రణాళికను అమలు చేస్తున్నారు.



గంగవరం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులతో చదివిస్తున్న ఉపాధ్యాయిని



నైట్ విజిట్‌లో చదువుపై ఆరా తీస్తున్న ఇస్లాంపేట హైస్కూల్ హెచ్‌ఎం ప్రమీల

మా పాపలో ఎంతో మార్పు



మా అమ్మాయి దుర్గ నడుపూరు హై స్కూల్లో టెన్త్ చదువుతోంది. తొమ్మిదో తరగతి వరకు అంతంత మాత్రంగానే చదివేది. బడి నుంచి వచ్చాక పుస్తకాలు పక్కన పెట్టేసేది. ఇప్పుడు అలా కాదు, శ్రద్ధగా చదువుతోంది. ఉపాధ్యాయులు ఇంటికి వచ్చి తనిఖీ చేస్తుండటంతో మరింతగా చదువుపై దృష్టి సారిస్తోంది. మంచి మార్కులు సాధిస్తుందని నమ్మకం వచ్చింది. ప్రభుత్వ పాఠశాలలో ఇంత శ్రద్ధ చూపించడం ఆనందంగా ఉంది.

– ఎ.నాగలక్ష్మి, నెల్లిముక్కు

విద్యార్థుల విజయమే లక్ష్యం



డీఈవో ఆదేశానుసారం పదో తరగతి విద్యార్థుల కోసం ప్రణాళికలు సిద్ధం చేశారు. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. పరీక్షలకు 100 రోజుల ప్రణాళికతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. ఈ ఏడాది శతశాతం ఉత్తీర్ణతతో పాటు జిల్లాలోనే ప్రథమ స్థానం సాధించేలా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాం.

– రాచకొండ శ్రీనివాస్, హెచ్‌ఎం, నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

మంచి మార్కులు సాధిస్తాను



పాఠశాలలోనే అన్ని సబ్జెక్టులు అర్థమయ్యేంత వరకు చెబుతున్నారు. ఉపాధ్యాయులు దగ్గరుండి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఇప్పటి వరకు టెన్త్ పాసవగలనా అనే భయం ఉండేది. ఇప్పుడు స్టడీ అవర్స్‌తో సబ్జెక్ట్ బాగా ఇంప్రూవ్ అయింది. పరీక్షలంటే భయం కూడా లేదు. మంచి మార్కులతో పాసవుతాననే నమ్మకం వచ్చింది.

– ఆర్.మల్లేశ్వరి, పెదగంట్యాడ

లెక్కలంటే భయం పోయింది



సబ్జెక్టుల్లో వెనకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి, మా టీచర్లు శిక్షణ ఇస్తున్నారు. నాకు గణితం అంటే భయం. ఇప్పుడు అలా కాదు.. నిద్రలో లేపి లెక్కలు అడిగినా ఇట్టే చెప్పేస్తాను. నాలో భయం పోగొట్టి, లెక్కలంటే ఇష్టం వచ్చేలా మా ఉపాధ్యాయులు తయారు చేశారు. వారికి రుణపడి ఉంటాను. లెక్కల్లో 100కి 100 సాధిస్తాను.

– రాయి సుదర్శన్, బర్మా కాలనీ



నైట్ విజిట్‌లో విద్యార్థిని చదువుపై ఆరా తీస్తున్న నడుపూరు హైస్కూల్ ఉపాధ్యాయిని



యారాడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను చదివిస్తున్న ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం

1 100 రోజుల ప్రణాళిక

పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఫలితాలే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నారు. విద్యార్థులు సబ్జెక్టుపై పట్టు సాధించేందుకు, 100 రోజుల ప్రణాళిక రూపొందించారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధతో విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు.

2 మోడల్ పేపర్లు

ఈ విద్యా సంవత్సరంలో కూడా ఏడు పేపర్లతో పరీక్షలు నిర్వహించనుండడంతో విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మోడల్ పేపర్లు తయారు చేసి తర్ఫీదునిస్తున్నారు.

3 నైట్ విజిట్

జిల్లా విద్యా శాఖాధికారి చంద్రకళ ఆదేశాల మేరకు రాత్రి వేళల్లో విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారి చదువులపై ఆరా తీస్తున్నారు. దీని కోసం ప్రత్యేకంగా ఉదయం, రాత్రి వేళల్లో స్టడీ అవర్స్ ఏర్పాటు చేశారు.

4 స్టడీ మెటీరియల్

జిల్లా విద్యా శాఖకు చెందిన జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ఆధ్వర్యంలో ప్రత్యేక నిపుణులతో తయారు చేయించిన స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్నారు.

5 విద్యార్థుల దత్తత

చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, ఆయా సబ్జెక్టు ఉపాధ్యాయులు వారిని దత్తత తీసుకుని, సులభంగా అర్థమయ్యే రీతిలో బోధన సాగిస్తున్నారు. విద్యార్థులను ఏబీసీడీ గ్రేడులుగా విభజించి చదివిస్తున్నారు.

6 ప్రత్యేక తరగతులు

పాఠశాలల్లో ఉదయం 8.30 గంటల నుంచి ఒక గంట, సాయంత్రం 5.30 మరో గంట విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

7 వారాంతపు పరీక్షలు

ప్రతీ సబ్జెక్టుకు సంబంధించి ప్రతీ వారం కొత్త మోడల్ పేపర్ ఆధారంగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. విద్యార్థులు పెర్ఫార్మెన్స్ ఆధారంగా వారికి పాఠాలను బోధిస్తున్నారు. వారిలో ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేస్తున్నారు.

8 స్ఫూరిదాయక ప్రసంగాలు

పబ్లిక్ పరీక్షలంటే విద్యార్థుల్లో ఉండే భయాన్ని తొలగించేందుకు, వారిలో స్ఫూర్తి నింపేందుకు పలు రంగాల్లో విజేతలుగా నిలిచిన వారిని తీసుకువచ్చి మోటివేషన్ తరగతులు నిర్వహిస్తున్నారు. వారిలో మానసిక ఒత్తిడి తగ్గించేందుకు వ్యాయామ ఉపాధ్యాయులతో ప్రతి రోజూ ఎక్సర్‌సైజ్ చేయిస్తున్నారు.

9 తల్లిదండ్రులతో సమావేశాలు

చదువు విషయంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా, వారిలోని భయాలను తొలగించేందుకు తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల ప్రవర్తనకు అనుగుణంగా తల్లిదండ్రుల సూచనలతో వారిని సిద్ధం చేస్తున్నారు.

10 అన్ని శాఖల సమన్వయం

కలెక్టర్ ఆధ్వర్యంలో విద్యాశాఖ, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో కృషి చేస్తున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించి రాష్ట్రాన్ని ఉన్నత స్థానంలో నిలబెట్టాలనే పట్టుదలతో ఉన్నారు.

వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేయాలి

పార్టీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు



పాల్గొన్న వైఎస్సార్‌సీపీ బీఎల్‌ఏలు, నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త చందు

గాజువాక: నియోజకవర్గంలోని అన్ని వార్డుల్లో ఓటర్ల జాబితాలు పక్కాగా ఉండేవిధంగా వైఎస్సార్‌సీపీ బీఎల్‌ఏలు కృషి చేయాలని ఆ పార్టీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు కోరారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ బూత్ లెవెల్ ఏజెంట్లు, ముఖ్య నాయకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డుల్లోని కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జులతో బీఎల్‌ఏలు సమన్వయం చేసుకుంటూ పని చేయాలన్నారు. వివిధ వార్డుల్లో ఇప్పటికే బూత్ కమిటీల నియామకం 80 శాతం పూర్తయిందని, మిగిలిన వార్డుల్లోనూ త్వరితగతిన పూర్తి చేయాలని నాయకులను కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేపట్టిన అభివృద్ధి పనులను వార్డుల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. కార్యకర్తలు, నాయకులు ఐక్యంగా కృషి చేసి గాజువాకలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేద్దామన్నారు. బూత్ ఏజెంట్లు, కన్వీనర్లు పార్టీ ఓట్ బ్యాంక్‌ను మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, రాజాన రామారావు, మహ్మద్ ఇమ్రాన్, వార్డ్ ఇన్‌చార్జులు, నాయకులు సిరట్ల శ్రీనివాస్, కోమటి శ్రీనివాసరావు, మెడికల్ బాబు, రెడ్డి జగన్నాథం, మంత్రి మంజుల, మహలక్ష్మినాయుడు, మార్పు శేషు, రంబ నారాయణమూర్తి, ఎన్నేటి రమణ, ఉమాదేవి, విమల, థామస్, ఆశ, సత్యవతి, కల్పన, తాటికొండ జగదీష్, కోమటి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సమష్టి పోరాటం



సెమినార్‌లో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వివిధ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు

ఉక్కునగరం: సమష్టి పోరాటాలతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందామని వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ వ్యూహాత్మక అమ్మకానికి వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం న్యూఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో జరిగిన సెమినార్‌లో సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి, సీపీఐ జాతీయ కార్యదర్శి ఎ.రాజా, ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ,ఏఐటీయూసీ జాతీయ ప్రధానకార్యదర్శి అమరజీత్ కౌర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మేధావుల ఫోరం కన్వీనర్ చలసాని శ్రీనివాస్, జై భారత్ పార్టీ అధ్యక్షుడు జె.డి.లక్ష్మీనారాయణ పాల్గొని స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తీవ్రంగా వ్యతిరేకించారు. కేంద్ర బీజేపి ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా మూడేళ్లుగా కార్మిక వర్గం ఆందోళన చేస్తోందని, భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో ఆందోళనలు చేయడం ద్వారా ప్లాంట్‌ను కాపాడుకుందామన్నారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, సీహెచ్. నర్సింగరావు, కె.ఎస్.ఎన్.రావు, అయోధ్యరామ్, వై. మస్తానప్ప, జి.గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అత్తింటి ఎదుట కోడలి నిరసన



అత్తింటి ఎదుట నిరసన తెలియజేస్తున్న కోడలు చట్టి రమ్య

కూర్మన్నపాలెం: భర్త విడాకులు కావాలంటూ లాయర్ నోటీసు పంపడంపై ఆగ్రహించిన ఓ యువతి అత్తింటి ఎదుట నిరసనకు దిగింది. ఈ సంఘటన దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితురాలు చట్టి రమ్య తెలిపిన వివరాలివి.. పెదగంట్యాడకు చెందిన చట్టి రమ్యకు అగనంపూడి ప్రాంతానికి చెందిన ఉక్కు కాంట్రాక్ట్ కార్మికుడు చట్టి వెంకటఅప్పారావుతో 2021లో వివాహం జరిగింది. వివాహ సమయంలో సుమారు 5 లక్షల రూపాయల నగదు, ద్విచక్రవాహనం, సుమారు రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, 3 లక్షల రూపాయలు విలువ చేసే సారె సామగ్రి ఇచ్చారు. పెళ్లయిన మూడు నెలలు కాపురం బాగానే సాగినా.. అనంతరం అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు ఎక్కువయ్యాయి. ఈ వేధింపులు తట్టుకోలేక అనారోగ్యానికి గురై, కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రమ్యకు ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన అనంతరం ఆమె కన్నవారింటికి దేవాడ వెళ్లిపోయింది. ఫిబ్రవరి 3వ తేదీన భర్త వెంకట అప్పారావు నుంచి తనకు విడాకుల నోటీసులు వచ్చాయి. బుధవారం ఆమె గ్రామ పెద్దలను తీసుకొని అత్తింటికి వెళ్లగా వారు లోపలకు రానివ్వలేదు. దీంతో ఆమె అత్తింటి ఎదుట నిరసనకు దిగింది. తాను సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నానని, తనపై అభాండాలు వేస్తే సహించేది లేదని ఆమె ఆగ్రహం వ్యక్తం చేసింది. సమాచారం తెలుసుకున్న దువ్వాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రమ్యను, అత్తింటి వారిని పోలీస్‌స్టేషన్‌కు రావాల్సిందిగా సూచించారు. స్టేషన్‌లో రమ్య ఫిర్యాదు మేరకు ఇరువురిని కౌన్సెలింగ్ నిమిత్తం దిశ పోలీస్‌స్టేషన్‌కు పంపుతున్నట్లు దువ్వాడ పోలీసులు తెలిపారు.

ప్రజల ఆరోగ్యానికి 'సురక్ష'

67, 75 వార్డుల్లో జగనన్న సురక్ష-2 శిబిరాలకు విశేష స్పందన



67వ వార్డులో సురక్ష బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త చందు, జెడ్పీ ప్రసాదరావు



చిన్నారికి ఇంజక్షన్ ఇస్తున్న సిబ్బంది

గాజువాక: పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడం కోసమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు అన్నారు. 67వ వార్డు జోగవానిపాలెం యూపీహెచ్‌సీలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలతో పాటు మందులు కూడా ఉచితంగా అందిస్తారన్నారు. అవసరమైన రోగులను మెరుగైన వైద్యం కోసం రిఫరల్ ఆస్పత్రికి తరలిస్తారని చెప్పారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని పేర్కొన్నారు. ఒకపక్క సంక్షేమం, మరోపక్క అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. జీవీఎంసీ గాజువాక జోనల్ కమిషనర్ ప్రసాదరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బి.ప్లెవియా మోనికా, డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి తదితరులు పాల్గొన్నారు.

75వ వార్డులో 443 మందికి సేవలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కు సచివాలయ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాన్ని నెల్లిముక్కు పీహెచ్‌సీలో బుధవారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతీ కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్న దృఢ సంకల్పంతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదలందరికీ మెరుగైన వైద్యాన్ని ఉచితంగా అందించి, ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్నారన్నారు. ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేసి ఆధునిక యంత్రాలతో పాటు స్పెషలిస్టు వైద్యులను సైతం ఇళ్ల వద్దకే తీసుకొచ్చి పరీక్షలు చేయించి, ఉచితంగా మందులు అందిస్తున్నారన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఆరోగ్య శ్రీ కార్డులను పంపిణీ చేశారు. శిబిరంలో 443 మందికి ఐదుగురు వైద్యులు సేవలు అందించారు. నెల్లిముక్కు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ రమేష్ బాబు, డాక్టర్ హేమలత, జనరల్ మెడిసన్ డాక్టర్ చైతన్య వర్మ, గైనకాలజిస్ట్ డాక్టర్ పావని, జనరల్ డాక్టర్ మానస రోగులను పరీక్షించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ ప్రసాద్, ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్, తనకాల సత్యనారాయణ, కె.హేమ, కొయ్య భారతి, కటికల కల్పన, ఆనంద్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



వివరాలు నమోదు చేస్తున్న సచివాలయ సిబ్బంది



75వ వార్డులోని శిబిరంలో ఆరోగ్య శ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న ఉరుకూటి చందు, జెడ్పీ ప్రసాద్



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ చైతన్య వర్మ

పేదల చెంతకు మోదీ పథకాలు

గాజువాక: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ఉద్దేశమని గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. బీసీ రోడ్‌లో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అమలు చేసిన ప్రతీ పథకం పేదలకు చేరిందన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ యూసీడీ విభాగం సిబ్బంది వనజ, రాము, వైద్యాధికారి డాక్టర్ మానస, పోస్టల్ డిపార్ట్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నెలల తరబడి రోడ్డుపైనే వాహనాలు






వెంకటేశ్వర కాలనీ లలితాదేవి ఆలయం వద్ద నానో కారు, అదే ప్రాంతంలో ఉన్న వాహనం

అక్కిరెడ్డిపాలెం: నెలల తరబడి వాహనాలు రోడ్డుపైనే ఉండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. 69వ వార్డు వెంకటేశ్వర కాలనీ దరి లలితాదేవి ఆలయం వద్ద ఏపీ 37 బీబీ 6867 నంబర్ గల నానో కారు, కేఎల్ 62 బీ 4183 నంబర్ గల చెవ్రోలెట్ వాహనాలు రోడ్డుపైనే నిలిపి ఉన్నాయి. నెలల తరబడి వాహనాలు ఉండటంతో ఎవరైనా దొంగలు కార్లను దొంగిలించి, ఇక్కడ వదిలేశారేమో అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. గాజువాక పోలీసులు స్పందించి, ఈ వాహనాలు తరలించాలని కోరుతున్నారు.

గద్దర్ స్ఫూర్తితో ఉద్యమం ఉధృతం



మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: ప్రజా గాయకుడు గద్దర్ స్ఫూర్తితో ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. గద్దర్ ప్రధానంగా పాలకుల వైఫల్యాలను, తద్వారా ప్రజలపై పెరుగుతున్న భారాలకు వ్యతిరేకంగా తన గళాన్ని విప్పి ప్రజాచైతన్యం కలిగించారని, అదే రీతిలో పోరాడదామన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 1091వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో ఎస్.ఎం.ఎస్-1 విభాగ కార్మికులు, ఉత్తరాంధ్ర ప్రజాపార్టీ కార్యకర్తలు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తిపరంగా ఆటంకాలను సృష్టిస్తూ.. కార్మిక శక్తిని అణగదొక్కే విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలన్నారు.కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.